క్లుప్తంగా

వరద బాధితులకు బియ్యం పంపిణీ



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఆర్‌ఐ

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో వరద బాధితులకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ సాయిశ్రీకాంత్ మంగళవారం రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి గుండువాగు ఉధృతంగా ప్రవహించడంతో సమీపంలోని ఇళ్లు, కిరాణ దుకాణాలు, హోటళ్లల్లోకి వరద నీరు చేరింది. దీంతో బాధిత కుటుంబాలకు 15కేజీల చొప్పున రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ మేరకు బాధితులకు నిత్యావసరాల కోసం గ్రామ వీరభద్రాలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ కొంత నగదు అందించారు.

చిట్కుల్ జీలంకుంట పరిశీలన



జీలంకుంటను పరిశీలిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. దీంతో మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో ఉన్న జీలంకుంటకు గండి పడింది. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ సహదేవ్, ఎస్‌ఐ నర్సింహులు జీలంకుంటను పరిశీలించి ఇరిగేషన్ ఏఈ హరీష్‌రెడ్డికి సమాచారం అందజేశారు. అనంతరం చండూర్‌లో కూలిన ఓ ఇంటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సునీల్‌సింగ్, ఇన్‌చార్జ్ ఎంపీఓ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి జితేందర్ ఉన్నారు.

గంగమ్మతల్లికి పూజలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని మినీట్యాంక్‌బండ్, పెద్ద చెరువు అలుగు పారుతుండటంతో మంగళవారం బతుకమ్మఘాట్, కట్టమైసమ్మదేవికి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు సుమన్‌శర్మ సమక్షంలో పూజలు నిర్వహించగా.. మాజీ ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ గంగమ్మతల్లికి పసుపు, కుంకుమ, పూలతో సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ చిన్న చిన్నంరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



పాఠశాల సిబ్బందితో చర్చిస్తున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ విఠల్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని చిట్కుల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలు మెరుగు పడేందుకు వినూత్న బోధన పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్‌పీ మల్లేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతి వార్షిక పరీక్షల్లో సాంఘిక శాస్త్రంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సబ్జెక్ట్ ఉపాధ్యాయురాలు స్వరూపరాణి బహుమతులు అందజేశారు. మంగళవారం మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో సాంఘికశాస్త్రంలో 90కి పైగా మార్కులు సాధించిన 17 మంది విద్యార్థులకు అందజేసినట్లు హెచ్‌ఎం నర్సింగం తెలిపారు.

బస్తా దొరకడమూ గగనమే..!

- యూరియా కోసం రోజంతా పడిగాపులు
- ఒక్క బస్తా మాత్రమే ఇస్తున్న వైనం
- రైతులను పట్టించుకోని యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క బస్తా యూరియా కోసం రోజంతా పస్తులతో క్యూలో నిల్చుని నరకయాతన అనుభవిస్తున్నారు. అయినప్పటికీ బస్తా యూరియా దొరకరడమూ గగనంగా మారింది. వర్షానికి తడుస్తూ రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. చివరికీ బస్తా యూరియా ఎరువు దొరకడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



నర్సాపూర్: మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు



కొల్చారం: యూరియా బస్తాల కోసం రైతులకు టోకెన్లను అందిస్తున్న ఏఓ



కౌడిపల్లి: రైతువేదికలో రైతులకు టోకెన్లు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు



చిన్నశంకరంపేట: పోలీస్ బందోబస్తుతో రైతులకు యూరియా పంపిణీ



నిజాంపేట: యూరియా కోసం వేచి చూస్తున్న రైతులు

శాశ్వత జ్ఞాపకాల చిత్రరూపం

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

రామాయంపేట(మెదక్): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం ఫొటోగ్రాఫర్లు కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొన్ని చిత్రాలు శాశ్వతంగా గుర్తుండిపోతాయని అన్నారు. అయితే ప్రస్తుతం ఆదరణ కరువైన ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు హరిప్రసాద్, సంతోష్‌రెడ్డి, రామకృష్ణ, బన్ని, సర్దార్ నాయక్, స్వామి, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ..

చిన్నశంకరంపేట(మెదక్): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు నిద్రబోయిన స్వామి పాల్గొన్నారు.



రామాయంపేటలో లూయిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఆర్వో ప్లాంటు ఏర్పాటు హర్షణీయం: డీఈఓ

చేగుంట(తూప్రాన్): భాగ్యనగర్ ఆర్యవైశ్య యూత్ పాఠశాలలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడం హర్షణీయమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్యవైశ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్వో ప్లాంటును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ భాగ్యనగర్ ఆర్యవైశ్య యూత్ పాఠశాలకు చేసిన సేవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, ఆర్యవైశ్య యూత్ అసోసియేషన్ ఫౌండర్ చందా నాగరాజు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తున్న డీఈఓ, భాగ్యనగర్ ఆర్యవైశ్య యూత్ సభ్యులు

పెచ్చులూడిన పంచాయతీ భవనం



పెచ్చులూడిన కంచన్‌పల్లి పంచాయతీ పైకప్పు

కౌడిపల్లి(నర్సాపూర్): పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో పైకప్పు పెచ్చులూడి ఘటన మండలంలోని కంచన్‌పల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గత ప్రభుత్వం నూతనంగా పంచాయతీ కార్యాలయం భవనం నిర్మించేందుకు రూ.20లక్షలు మంజూరు చేశారు. అయితే నూతన భవనం నిర్మించేందుకు స్థలం లేదని నిర్మాణం పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిథిలావస్థ ఇళ్లల్లో ఉండొద్దు

కొల్చారం(నర్సాపూర్): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోయే అవకాశం ఉందని, అలాంటి ఇళ్లల్లో నివాసం ఉండవద్దని తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఎంపీడీఓ రఫీక్ ఉన్నిసా ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని పైతర, రాంపూర్ గ్రామాల్లో వర్షం కారణంగా కూలిపోయిన ఇళ్లను వారు పరిశీలించారు. బాధితులను ఆదుకునేలా ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు పడిగె స్వామిని కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ బాలలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, నాగరాజు, బాలకిషన్, నర్సింలు, నరేష్, రంజిత్‌రెడ్డి, వెంకటేశం, శ్రీధర్ తదితరులున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని పెద్ద చెరువు అలుగు వద్ద పేరుకుపోయిన పిచ్చిమొక్కలను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు జేసీబీతో తొలగించారు. అనంతరం కట్టమైసమ్మ, మత్తడి పోచమ్మ చెరువు నిండి అలుగు పారాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు లక్ష్మీనర్సయ్య, రాంలు, వెంకటేష్, కొండల్, పోచగౌడ్, అశోక్, త్రినేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవిని మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు రాజేశ్, విఘ్నేష్‌లు ఆమెకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజల్లో నాయకులు దుర్గారెడ్డి, సాయాగౌడ్, నవీన్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెంలో జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో సీఎమ్మార్ ఆస్పత్రి వైద్యులు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ దుర్గప్రసాద్‌రెడ్డి, వైద్యులు సాయిశ్రీ, శివ, పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు నారాయణ పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

రేగోడ్(మెదక్): వినాయక చవితిని పురస్కరించుకొని గణేశ్ మండపాలకు అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ పోచయ్య తెలిపారు. మంగళవారం మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గణేశ్ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. పబ్లిక్ స్థలాల్లో పంచాయతీ అనుమతి పొందాలన్నారు. అలాగే రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు.

నిబంధనలు తప్పనిసరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వినాయక చవితిని పురస్కరించుకొని గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ నర్సింహులు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండపం ఏర్పాటుకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలు వినియోగించడంతో పాటు మండపం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



నిజాంపేట: సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ రాజేశ్

డీజేలకు అనుమ తి లేదన్నారు. ఊరేగింపు సమయంలో అనుమతులు తీసుకోవాలన్నారు.

శాంతి కమిటీ సమావేశం.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలో గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాజేశ్ శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం హిందూ, ముస్లింలతో మాట్లాడారు. గణేష్ విగ్రహాల ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రసాద్, షేక్ హుస్సేన్, సద్దాం, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

◆ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కళాశాలను సందర్శించారు. అనంతరం కళాశాల ఎస్ఎఫ్ఐ అధ్యక్షురాలిగా పూజ, కార్యదర్శిగా గీతికతో పాటు 21 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ అనారోగ్యంతో ఉద్యమకారుడు మృతి

రేగోడ్(మెదక్): మండలంలోని ఆర్.ఇటిక్యాలకి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు శ్రీనివాస్ (52) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. ఆయన ఎన్నో ఉద్యమాల్లో తనవంతుగా పోరాటం చేశాడు. శ్రీనివాస్ మృతితో గ్రామంలో విషాధ చాయలు అలుముకున్నాయి. ఈ మేరకు వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మణ్, సహచర ఉద్యమకారులు జయరావ్, సంగారెడ్డి సంతాపం తెలిపారు.

◆ ఘనంగా మహంకాళీ దేవాలయ వార్షికోత్సవం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో మంగళవారం మహంకాళీ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం గణపతి హోమం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పూజారి రాఘవేంద్ర శర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

◆ పాఠశాలకు నూతన భవనం నిర్మించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సంధ్య మంగళవారం ఎంపీడీఓ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే గదిలో 1 నుంచి 5వ తరగతి వరకు బోధన జరుగుతుందన్నారు.

◆ డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేయాలి

నర్సాపూర్: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌లు తహసీల్దార్ శ్రీనివాస్‌ను కోరారు. మంగళవారం నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పలువురి పేదల ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, నిరుపేదలను గుర్తించి ఇళ్లు పంపిణీ చేయాలన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ నగేశ్

రేగోడ్(మెదక్): కొంతకాలంగా కురుస్తున్న వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. ఈనెల 18న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఊర కుంటకు గండి! కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆయన ఇరిగేషన్ ఈఈ రవీంద్ర కిషన్‌తో కలిసి ఊర కుంటను పరిశీలించారు. నీటి ఉధృతి తగ్గగానే గండిని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జగిర్యాల చెరువును సందర్శించి అలుగుపై పారుతున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పురాతన గృహాల్లో ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తరెడ్డి, ఇరిగేషన్ డీఈ రోహిణి, ఏఈ రఘుపతి తదితరులు ఉన్నారు.



ఊర కుంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్, ఇరిగేషన్ అధికారులు

సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్ల వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

పెద్దశంకరంపేట(మెదక్): ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణాబాయికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు పెంచడంతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రసూతి సెలవులు, పెండింగ్ బిల్లులు, పనిభారం వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ యాదయ్య, సాయిలు, ఆశావర్కర్లు పద్మ, గంగమణి, సౌందర్య, మౌనిక, సావిత్రి ఉన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆశా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం వైద్యుడికి వినతిపత్రం అందజేశారు.



కౌడిపల్లి: పీహెచ్‌సీలో వైద్యాధికారి శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

వినతిపత్రం అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఆశా వర్కర్లు మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందించారు.

కౌడిపల్లి పీహెచ్‌సీ ఎదుట ధర్నా..

కౌడిపల్లి(నర్సాపూర్): ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించడంతోపాటు రూ .18వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మండల వైద్యాధికారి శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు.

పంటల పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని మందాపూర్‌లో మంగళవారం పత్తి పంటను మండల వ్యవసాయాధికారి రాజేశ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

నష్టపోయిన పంటల వివరాల సేకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరించారు. ఈ మేరకు పుత్తూరు వీరోజుపల్లి, పెద్ద శంకరంపేట, టెంకటి, కోలపల్లి బూరుగుపల్లి, జూకల్ తదితర గ్రామాల్లో నీటమునిగిన వరితోపాటు పత్తి, మొక్కజొన్న, పెసర పంటలను అధికారులు పరిశీలించారు. ఇన్‌ఛార్జ్ ఏవో కృష్ణ వివరాల ప్రకారం.. మండలంలో 179 ఎకరాల వరి పంట, 59 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.



అల్లాదుర్గం: పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సెర్ప్ డీపీఎం వెంకటేశ్

పెద్దశంకరంపేట (మెదక్): మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ డీపీఎం వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 17వ మహిళా సమాఖ్య వార్షికోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించచారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మహిళలు స్త్రీ నిధి రుణాలు, బ్యాంకు రుణాలతోపాటు వ్యాపారాలు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సంఘానికి రుణం అందించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ గంగారం, ఏపీఎం అశోక్, సీసీలు నిరంజన్, యోహన్ వీరాచారి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

ఎవరూ బయటకు రావొద్దు

- మంజీరా నదిని పరిశీలించిన డీఎస్పీ
- చెరువులు, కుంటల సందర్శన
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

నర్సాపూర్: జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారిపోయి అలుగులు పారుతున్నాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని రాయరావు చెరువును మంగళవారం తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పరిశీలించారు. ఈ మేరకు సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగంలకు పలు సూచనలు చేశారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): సింగూర్ ప్రాజెక్ట్ నీటి విడుదలతో మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుందని, ఈ పరివాహక ప్రాంతం వైపు ఎవ్వరూ రావొద్దని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పోలీస్ సిబ్బందితో కలిసి చిట్కుల్ పాత వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరాను పరిశీలించారు.



చిలప్‌చెడ్: చిట్కుల్ వంతెనపై ప్రవహిస్తున్న మంజీరాను పరిశీలిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

వర్షానికి కుంగిన కల్వర్టు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట-రుద్రారం గ్రామాల మధ్యన ఉన్న కల్వర్టు కుంగిపోయింది. దీంతో వాహనదారులు ప్రమాదానికి గురకాకుండ పంచాయతీ సిబ్బంది రాళ్లబండలు, ముళ్లపొదను అడ్డంగా పెట్టారు.



చిన్నశంకరంపేట: చందంపేట-రుద్రారం గ్రామాల మధ్య కుంగిన కల్వర్ట్

అలుగు పారుతున్న చెరువులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కౌడిపల్లి, రాయిలాపూర్, ముట్రాజ్‌పల్లి, తునికి గ్రామాలలో మంగళవారం చెరువు, కుంటలు అలుగు పారుతున్నాయి. తునికి కలీల్‌సాగర్ చెరువు అలుగు పారడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

రోడ్డును పునరుద్ధరించాలి



తెగిన రోడ్డుని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ఉసిరికపల్లి-వెల్దుర్తి ప్రధాన రోడ్డు పోతులబోగూడ వద్ద తెగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం తెగిపోయిన రోడ్డును పరిశీలించారు.

అప్రమత్తంగా ఉండాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లి, గోపని వెంకటాపూర్‌లో చెరువులను పరిశీలించారు.

ఉధృతి తగ్గని వరద

టేక్మాల్(మెదక్): మండలంలోని గుండువాగు నిండుకుండలా పారడంతో జోగిపేట -టేక్మాల్, ఎలకుర్తి-జోగిపేట రాకపోకలకు అంతరాయం కల్గింది.